నమస్తే తెలంగాణ

మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | గురువారం 18 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


# ఈ నెల 20న నవోదయ ప్రవేశ పరీక్ష

## 80 సీట్ల కోసం 4458 మంది దరఖాస్తు




కాగజ్‌నగర్, జనవరి 17: కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి పరీక్ష ఈ నెల 20న నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల నుంచి 4458 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి 983 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్మల్ జిల్లా నుంచి 1208 మంది దరఖాస్తు చేసుకోగా, 6 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. మంచిర్యాల జిల్లా నుంచి 1188 మంది విద్యార్థులకు, ఏడు పరీక్షా కేంద్రాలు, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి 1079 మందికి ఐదు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- జిల్లా రవాణ శాఖ అధికారి లెక్కల కిష్టయ్య
- నెల రోజుల పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు


మాట్లాడుతున్న డీటీవో కిష్టయ్య

మంచిర్యాల ఏసీసీ, జనవరి 17: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మంచిర్యాల జిల్లా రవాణ శాఖాధికారి లెక్కల కిష్టయ్య సూచించారు. మంచిర్యాల జిల్లా రవాణ శాఖ అధికారి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాలు నెల రోజుల పాటు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు. ఈ నెల 15 నుంచి వచ్చేనెల 14 వరకు ఈ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. బైక్ నడుపుతున్న వారు తప్పనిసరిగా హెల్మెట్, కారు డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం తాగి ఎట్టిపరిస్థితుల్లో వాహనాలు నడుపకూడదని తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేయొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని కోరారు. ఈ నెల రోజుల పాటు స్పెషల్ డ్రైవ్స్ ఉంటాయని పేర్కొన్నారు.


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

# కేసీఆర్ సర్కారు నిధులతోనే అభివృద్ధి పనులు

### మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాల టౌన్, జనవరి 17: కేసీఆర్ సర్కారు విడుదల చేసిన నిధులతోనే మంచిర్యాల పట్టణంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. పట్టణంలోని సున్నంబట్టి వాడలో జాతీయ రహదారి నిర్మాణ పనులను బుధవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఆనాటి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తాను ఎమ్మెల్యే ఉన్నప్పుడు మంజూరు చేయించిన అభివృద్ధి పనుల్లో భాగంగా పాత మంచిర్యాల నుంచి ఓవర్ బ్రిడ్జి వరకు రూ.12.39 కోట్లతో రోడ్డుకి ఇరువైపులా వెడల్పు, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. ఓవర్ బ్రిడ్జి నుంచి తోళ్లవాగు వరకు రూ.15.14 కోట్లతో రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, రోడ్డు కి ఇరువైపులా డ్రైన్, ఓవర్‌బ్రిడ్జి పైన హైపర్‌పాలిస్టర్ షీట్‌తో డాంబర్ రోడ్ వేయడం జరుగుతుందన్నారు. తోళ్లవాగు నుంచి రసూలుపల్లె వరకు రూ. 59.79 కోట్లతో సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు, ఫారెస్ట్ క్లియరెన్స్ మినహా దాదాపు పనులు పూర్తయినట్లు తెలిపారు. ఐబీ నుంచి బెల్లంపెల్లి వరకు రూ.14. 28కోట్లతో పాత ఆర్‌అండ్‌బీ రోడ్‌ని బాగు చేయడం, ఐబీ నుంచి శ్రీనివాస గార్డెన్ వరకు రూ.35 కోట్లతో డ్రైన్, డివైడర్, సెంట్రల్ లైటింగ్‌లకు టెండర్ ప్రక్రియ పూర్తయిందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఇలా జిల్లా కేంద్రంలో రూ. 136.60కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని దివాకర్ రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సుదమల్ల హరికృష్ణ, గాదె సత్యం, బోరిగాం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, పడాల రామన్న, పడాల రవీందర్, పడాల శ్రీనివాస్, చంద్రశేఖర్ హండే, బగ్గని రవి, శ్రీపతి వాసు, తదితరులు పాల్గొన్నారు.

● ఇదేనా మార్పు..

# ధాన్యం డబ్బులేవి..?

## రైతుల ఖాతాల్లో జమకావాల్సిన పైసలు రూ.123.72 కోట్లు

- కేసీఆర్ సర్కార్ హయాంలో 24 గంటల్లోపే జమైన డబ్బులు
- ధాన్యం విక్రయించి పది రోజులు గడిచినా దిక్కులేదు..
- రాకుండా పోయిన రైతుబంధు
- రైతుల నడ్డి విరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం



మంచిర్యాల, జనవరి 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ రైతులను గోస పెడుతున్నది. రైతుబంధు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపుతున్నది. ఇప్పుడేమో ధాన్యం కొనుగోళ్లు ముగిసి పది రోజులు గడిచినా.. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడం లేదు. సాగు చేసేందుకు పెట్టుబడి సాయం ఇవ్వలేదు సరే.. ఆరుగాలం కష్టపడి, రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన ధాన్యం డబ్బులను కూడా ఖాతాల్లో వేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ సర్కార్ ఉన్నప్పుడు పంట కాలం వచ్చిందంటే చాలు దుక్కి దున్నుకునే టైమ్‌కు రైతుబంధు ఇచ్చింది. ఇప్పుడేమో పంటలు వేసి నెల గడుస్తున్నా ఎకరం పొలం ఉన్న రైతుకు కూడా పెట్టుబడి సాయం అందించలేని దుస్థితి. అప్పుడేమో 24 గంటల కరెంట్ ఉంటే ఇప్పుడేమో 18 గంటల కరెంట్.. అప్పుడేమో ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు పడితే ఇప్పుడేమో వారం, పది రోజులు అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. కాంగ్రెసోళ్లు తీసుకొస్తామని చెప్పిన మార్పు ఇదేనా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

### మంచిర్యాలలో చెల్లించాల్సిన డబ్బులు అధికం

మంచిర్యాల, నిర్మల్ జిల్లాల్లో వరి ధాన్యం అధికంగా సాగు చేస్తారు. ఈ రెండు జిల్లాల్లో రైతులకు ధాన్యం డబ్బులు జమ చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నది. నిర్మల్ జిల్లాలో ఆలస్యంగా మేల్కొన్న అధికారులు గడిచిన నాలుగైదు రోజుల్లో క్లియర్ చేశారు. మంచిర్యాల జిల్లా రైతులకు మాత్రం పది రోజులు అవుతున్నా కొందరికీ డబ్బులు రాలేదు. మంచిర్యాల జిల్లాలోనే 7,023 మందికి రూ. 102.98 కోట్లు, నిర్మల్‌లో 1,146 మందికి రూ.12.77 కోట్లు, ఆదిలాబాద్‌లో 106 మందికి రూ.46.88 లక్షలు, ఆసిఫాబాద్‌లో రూ.7.5 కోట్లు చెల్లించాలి.


మంచిర్యాలలో ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

### ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వివరాలు

| జిల్లా | ధాన్యం విక్రయించిన రైతులు | జమ కావాల్సిన డబ్బులు | జమైనవి |
|---|---|---|---|
| మంచిర్యాల | 20,374 | రూ.300.14 కోట్లు | రూ.197.16 కోట్లు |
| నిర్మల్ | 34,899 | రూ.313.36 కోట్లు | రూ.300.59 కోట్లు |
| ఆసిఫాబాద్ | 780 | రూ.12 కోట్లు | రూ.4.5 కోట్లు |
| ఆదిలాబాద్ | 560 | రూ.4.78 కోట్లు | రూ.4.31 కోట్లు |
| మొత్తం | 56,466 | రూ.630.28 కోట్లు | రూ.506.56 కోట్లు |

### 25 రోజులైనా వడ్ల పైసలు రాలేదు..



ఉట్నూర్ రూరల్, జనవరి 17 : వర్షాకాలంలో ఎనిమిదెకరాల్లో వరి వేశా. మా గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో 25 రోజుల క్రితం 161 క్వింటాళ్ల వడ్లు అమ్మిన. అధికారులేమో అమ్మిన వారం లోపు వస్తాయని చెప్పారు. రెండు రోజులకోసారి బ్యాంకుకు వెళ్లి చూసుకుంటున్నా. డబ్బులు ఇప్పటివరకు కూడా జమ కాలేదు. కూలీలు, వరి కోత యంత్రం యజమానికి, మందుల దుకాణంలో పైసలు కట్టేది ఉంది. సానా ఇబ్బంది అయితండి. కేసీఆర్ సార్ ఉన్నపుడు ఇట్ల లేకుండే. అమ్మిన 24 గంటల్లో డబ్బులు వస్తుండే. వడ్ల డబ్బులు త్వరగా తమ ఖాతాలో వేయాలని కోరుతున్నారు.

*- భక్తు స్వామి, రైతు, గంగన్నపేట్, ఉట్నూర్ మండలం.*


రిబ్బెన్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

# మహిళా సంఘాల ఆధ్వర్యంలో నూనె తయారీ కేంద్రం

### ప్రారంభించిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

సిర్పూర్(యు), జనవరి 17: మండల కేంద్రంలోని ఐకేపీ స్త్రీనిధి భవనంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచి నూనె తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ బుధవారం ప్రారంభించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఐటీడీఏ ద్వారా రూ. 18 లక్షలతో ఈ నూనె తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ఈ మిల్లు దోహదం చేస్తుందన్నారు. ఇప్ప పరక నూనెతో పాటు వేరుశనగ, నువ్వుల నూనె తయారు చేస్తారని తెలిపారు. 200 గ్రాముల నూనె ధర రూ.150, లీటరు నూనె ధర రూ. 750 ఉంటుందని ఏపీఎం వెంకట రెడ్డి తెలిపారు. సొంత నూనె ధాన్యాలు తీసుకువస్తే కిలోకు రూ. 30 తీసుకుంటామన్నారు. 10 కిలోల ధాన్యాలకు 3.5 లీటర్ల నూనె వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ తొడసం భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, సింగిల్ విండో చైర్మన్ కేంద్రె శివాజీ, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తొడసం ధర్మరావ్, సర్పంచులు ఆత్రం వీణాబాయి, పెందోర్ నాగోరావ్, ఎంపీటీసీ గేడాం సార్జాబాయి, ఎంపీడీవో మధుసూదన్, డీఆర్డీవో సురేందర్ ఉన్నారు.

# టీబీజీకేఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

### ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, జనవరి 17: బెల్లంపల్లి ఏరియా లోని టీబీజీకేఎస్ కార్యకర్తలు, కార్మికులకు అండగా ఉంటానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గోలేటిటౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో బుధవారం రాత్రి యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికల్లో యూనియన్ నిర్ణయం ప్రకారం పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులు కల్పించారని గుర్తు చేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ నాయకుడు ధరావత్ మంగీలాల్, ఏరియా కమిటీ నాయకులు గజ్జెల్లి చంద్రశేఖర్, మాంతు సమ్మయ్య, మారిన వెంకటేశ్వర్లు, అలవేణి సంపత్, మాజీ ఉపాధ్యక్షుడు నల్లగొండ సదాశివ్, ఖైర్‌గూడ పిట్ కార్యదర్శి కార్నాథం వెంకటేశం, సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి మెరుగు రమేశ్, వర్క్‌షాప్ పిట్ కార్యదర్శి రాజేశం, ఏరియా అసుపత్రి పిట్ కార్యదర్శి అనుముల సత్యనారాయణ, సివిల్ డిపార్టుమెంట్ పిట్ కార్యదర్శులు శ్రీనివాస్, విజ్జన్న, జీఎం కార్యాలయ అసిస్టెంట్ పిట్ కార్యదర్శి మంకయ్య, స్టోర్స్ పిట్ కార్యదర్శి రమేశ్, మహిళ నాయకురాళ్లు వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, తదితరులున్నారు.


టీబీజీకేఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

# భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన

### మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, జనవరి 17: రోడ్డు భద్రతా నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరగుతుందని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్యతో కలిసి 37వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల బ్యానర్లు, వాల్ పోస్టర్లు, స్టిక్కర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు జిల్లాలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


స్టిక్కర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, రవాణా శాఖ అధికారులు

### ప్రత్యేక శిబిరాల నిర్వహణ

స్పష్టమైన ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణ, మార్పులు, తొలగింపుల కోసం జిల్లాలో ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు, సవరణ, తొలగింపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన 6,7,8 ఫారాలు బూత్ స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.

### దరఖాస్తుల స్వీకరణ

పాలనలో ఉత్తమప్రతిభ చూపిన ప్రభుత్వ ఉద్యోగుల(సివిల్ సర్వెంట్స్)కు అందించేందుకు ప్రధానమంత్రి పురస్కారాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. న్యూఢిల్లీ నుంచి కేంద్ర పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం సంయుక్త కార్యదర్శి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయం నుంచి బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాటగిరి 1లో 12 ప్రాధాన్యతల కింద ఉత్తమప్రతిభ చూపిన వారికి 10 అవార్డులు, క్యాటగిరి 2 కేంద్ర, రాష్ట్ర జిల్లాల వారీగా ఆవిష్కరణల విభాగంలో ఉత్తమ సేవలందించిన వారికి 6 అవార్డులు అందిస్తారని తెలిపారు. ఏప్రిల్ 1, 2021 నుంచి జనవరి 31, 2024 మధ్య కాలంలో చేసిన సేవలకు ఈ పురస్కారాలు అందిస్తారని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 5 దశలలో పరిశీలన జరుగుతుందని తెలిపారు. తుది దశలో పురస్కార గ్రహీతలను ప్రధానమంత్రి ఆమోదిస్తారని, ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.


రాస్తారోకో చేస్తున్న డ్రైవర్లు

# 'హిట్ అండ్ రన్' చట్టాన్ని సవరించాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- డ్రైవర్ల ఆందోళనలకు మద్దతు

జైనూర్, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి సవరణ చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. జైనూర్ ప్రధాన రహదారిపై డ్రైవర్లు రాస్తారోకో నిర్వహించగా, ఆమె వారికి మద్దతు తెలిపారు. ఇలాంటి చట్టాలతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడే అవకాశమున్నదని పేర్కొన్నారు. వెంటనే కేంద్రం పునరాలోచించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు నిర్వహిస్తామని ఆమె హెచ్చరించారు. అనంతరం డ్రైవర్లు మాట్లాడుతూ ప్రమాదం జరిగితే రూ. 7 లక్షల జరిమానా కట్టి, పదేండ్లు జైలు శిక్ష అనుభవించాలంటే, తమ కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్, వైస్ ఎంపీపీ చెర్లె లక్ష్మణ్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంతియాజ్ లాల, స్థానిక సర్పంచ్ మెస్రం పార్వతీలక్ష్మణ్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మెస్రం అంబాజీ, జైనూర్, సిర్పూర్(యు),లింగాపూర్ మండలాల ఆటో, జీపు, క్యాబ్,లారీ, ట్రాక్టర్ డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

- పన్నుల వసూలు వేగవంతం చేయాలి
- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జనవరి 17: ఉపాధి హామీ పథకం, గ్రామ పంచాయతీలో పన్నుల వసూలు నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, ఏపీవోలతో లక్ష్యాల సాధన ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉండి అర్హత గల ప్రతి కూలీకి పని కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఉపాధి హామీ పథకం కింద ఫారం పాండ్ల నిర్మాణాలు, కమ్యూనిటీ ఆస్తుల ఏర్పాటు, నర్సరీల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో మార్చి 31వ తేదీలోగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. గ్రామపంచాయతీల కార్యదర్శులు పన్నుల వసూలు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఆ దిశగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కుమార్ హుస్సేన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ


నామినేషన్ వేస్తున్న అధికారులు

# సింగరేణి అధికారుల సంఘం ఎన్నికల నామినేషన్ల స్వీకరణ

శ్రీరాంపూర్, జనవరి 17: సింగరేణి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేయడానికి బుధవారం శ్రీరాంపూర్‌లో ఏరియా ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ జీఎం సంజీవరెడ్డికి అధికారులు నామినేషన్లు సమర్పించారు. ఏరియా, కార్పొరేట్ స్థాయిలో పోటీకి అధికారులు నామినేషన్లు సమర్పించారు. ఏరియా ఆధ్యక్షుడిగా పోటీ చేస్తున్న జగ్గారెడ్డి, కేవీ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పోటీకి మల్లయ్య, చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా కిరణ్‌కుమార్, రాజారవిచరణ్, తిరుపతి, అమర్నాథ్, కోశాధికారిగా శ్రీరాములు, పద్మ, సంయుక్త కార్యదర్శిగా భీమన్న, పాషా నామినేషన్ పత్రాలు జీఎం సంజీవరెడ్డికి అందించారు. అలాగే కార్పొరేట్ సింగరేణి స్థాయి అధ్యక్షుడిగా పోటీకి ఏవీ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ ఖాదర్ నామినేషన్ వేశారు. ఈ నెల 19 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, 20, 21న విత్‌డ్రాకు అవకాశం ఉందని జీఎం సంజీవరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 28న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పోలింగ్ విధానంలో ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

# అట్టహాసంగా..

- రాష్ట్రస్థాయి పోటీలను ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు
- ఆణిముత్యాలను వెలికి తీసేందుకే క్రీడలు : ఎంపీ సోయం
- క్రీడలకు ప్రోత్సాహం అందిస్తాం.. : ఎమ్మెల్యే బొజ్జు
- జాతర్లలో కూడా క్రీడలు నిర్వహించాలి : ఎమ్మెల్యే జాదవ్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు


రన్నింగ్ పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

ఉట్నూర్, జనవరి 16 : ఉట్నూర్ పట్టణంలోని కుమ్రం భీం(కేబీ) ప్రాంగణంలో బుధవారం గురుకులాల ఇంటర్ సొసైటీ లీగ్ రాష్ట్రస్థాయి పోటీలను ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, జాదవ్ అనిల్‌కుమార్‌తో కలిసి ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగించడంతో పాటు విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఆణిముత్యాలను వెలికి తీసేందుకే రాష్ట్రస్థాయి క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. త్వరలో గ్రామస్థాయి క్రీడలను ప్రోత్సహించేందుకు ఫిబ్రవరిలో సంసద్ ఖేల్ నిర్వహించనున్నామన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. కేజీబీవీ, గురుకులాలను అప్‌గ్రేడ్ చేయాలని గురుకులాల డైరెక్టర్‌ను కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడలకు ప్రోత్సాహం అందిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మాట్లాడుతూ.. బోథ్ నియోజకవర్గంలోని జాతర్ల గ్రామంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా పాఠశాలలో కూడా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకులాల డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ నగేశ్, నాయకురాలు కుమ్ర ఈశ్వరీబాయి పాల్గొన్నారు.